క్లుప్తంగా

బుద్ధగయను బౌద్ధులకు అప్పగించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మహాబోధి బుద్ధగయను బౌద్ధులకు అప్పగించాలని కోరుతూ భారతీయ బౌద్ధ మహాసభ దేశవ్యాప్త నిరసనలో భాగంగా బీఎస్ఐ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భారతీయ బౌద్ధ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బేతాళ సుదర్శనం మాట్లాడుతూ 1949 బుద్ధగయ టెంపుల్ బీటీ యాక్ట్‌ను తక్షణం బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ బుద్ధగయ టెంపుల్ యాక్ట్‌ను రద్దుచేసి బుద్ధగయ పరిపాలన బౌద్ధ బిక్షువులకే అప్పజెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ భారతీయ బౌద్ధ మహాసభ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యారం శ్యామ్ కుమార్, కార్యదర్శులు పీవీ సుబ్బారావు, బేతాళ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఏలూరు (టూటౌన్): రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో రొయ్యల రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి కొనుగోలు ధరలు తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని, తగిన దిగుబడులు కూడా రావడం లేదని చెప్పారు. గతంలో వనామి రొయ్యల ఫీడ్ ధర టన్ను రూ.45 వేలు ఉంటే ప్రస్తుతం రూ.లక్షా 5 వేలకు పెరిగిపోయిందని తెలిపారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా రొయ్యలకు గిట్టుబాటు ధరలు పెరగలేదన్నారు. నాణ్యమైన సీడ్ అందించాలన్నారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50 సబ్సిడీ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుండపనేని సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారం జనార్ధన స్వామి రథోత్సవం సందర్భంగా నగరంలో గురువారం సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ బజారు, అగ్రహారం, న్యూ మార్కెట్, గజ్జెల వారి చెరువు ప్రాంతం, కుండీ సెంటర్, పెరుగు చెట్టు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.



నగరంలో కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



కలెక్టరేట్ వద్ద యువత పోరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండా

- పార్టీ ఆవిర్భావ దినోత్సవం, యువత పోరు
- శ్రేణుల్లో నూతనోత్సాహం

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడింది. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్ సీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం చేస్తోన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు యువత, విద్యార్థుల పట్ల కూటమి సర్కారు నిర్లక్ష్యం, కక్షసాధింపుపై రోడ్డెక్కాయి. ఏలూరు నగరంలోని ఫైర్‌స్టేషన్ సెంటర్ ప్రాంతంలో జోహార్ వైఎస్సార్, జై జగన్, జైజై జగన్ నినాదాలతో హోరెత్తించారు. యువ నాయకులు, మహిళా నేతలు ఫ్ల కార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. కూటమి సర్కారు తీరును నిరసించారు. నగరంలోని ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి ఎన్ఆర్‌పేట మీదుగా జెడ్పీ సెంటర్, కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. పార్టీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ ఏలూరు, దెందులూరు నాయకులంతా హాజరయ్యారు.



పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులు జిజ్జువరపు విజయనిర్మల, జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయబాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు వైఎన్‌వీ శివరావు, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, కట్టా ఏసుబాబు, తేరా ఆనంద్, బండ్లమూడి సునీల్, విద్యార్థి విభాగం అధ్యక్షులు రాజేష్, కిలాడి దుర్గారావు, భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్లు అందజేత

ఏలూరు (టూటౌన్): అండర్ గ్రౌండ్ డ్రెయిన్లలో పనిచేసే కార్మికులు అనారోగ్యానికి గురికాకుండా ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇచ్చే ఒంటి పరిశుభ్రతకు సంబంధించిన వస్తువులను నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్ కార్మికులకు అందజేశారు. ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ చాంబర్లో బుధవారం వారు మాట్లాడుతూ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలను శుభ్రపరిచే కార్మికులు 26 మంది ఉన్నట్టు చెప్పారు. వీరికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి లీటర్ కొబ్బరి నూనె, 12 రిన్ సబ్బులు, 12 డెట్టాల్ సబ్బులు, 2 జతలు చెప్పులు, 3 టవల్స్ ప్రభుత్వ నుంచి ఇస్తున్నట్టు చెప్పారు. వీరికి ప్రతి నెలా ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, డీఈ రజాక్, ఏఈ సాయి, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సూపర్‌వైజర్ దాసు, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, తంగెళ్ల రాము, తదితరులు ఉన్నారు.



కార్మికులకు వస్తువుల కిట్లు అందిస్తున్న దృశ్యం

మహిళల రక్షణకు శక్తి యాప్

ఏలూరు టౌన్: శక్తి యాప్‌ను వినియోగించుకొని ఆపద సమయాల్లో పోలీసుల సాయం పొందాలని సినీ నటి మీనాక్షి చౌదరి మహిళలు, విద్యార్థులు, ఉద్యోగినులకు సూచించారు. ఏలూరు నగరంలోని షాపింగ్ మాల్లో బంగారు ఆభరణాల దుకాణాన్ని ప్రారంభించేందుకు మీనాక్షి చౌదరి ఏలూరు నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా అదే నగల దుకాణం వద్ద ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శక్తి యాప్ పోస్టర్ను నటి మీనాక్షి చౌదరి చేతులు మీదుగా బుధవారం విడుదల చేశారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు, ఏలూరు 3 టౌన్ సీఐ కోటేశ్వరరావు, అభయ రక్షక దళ టీం సభ్యులు, ప్రముఖ నిర్మాత అంబికా కృష్ణ సీఎంఆర్ సంస్థల అధినేత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సినీనటి మీనాక్షి చౌదరి

జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ఎంసీహెచ్ విభాగం వైద్యుల నిర్లక్ష్యంతో ప్రసూతికి వచ్చే మహిళలు క్షేమంగా ఇంటికి వెళ్లే వరకు భయంతో ఉండాల్సి వస్తోంది. తీరా ఇంటికి తీసుకెళ్లినా ఏదో ఒక అనారోగ్య సమస్య రావటం, ప్రాణాపాయ స్థితికి వెళ్లటం పరిపాటిగా మారింది. వైద్యుల తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం అయ్యప్పరాజు గూడేనికి చెందిన దాసరి మరియ రాణి ఏలూరు సర్వజన ఆసుపత్రిలో తల్లిబిడ్డా విభాగంలో ప్రసూతికి కొద్దిరోజుల క్రితం చేరింది. మరియరాణికి సిజేరియన్ ఆపరేషన్ చేయగా బిడ్డకు జన్మనిచ్చింది. డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించగా అనంతరం కొందరు సిబ్బంది సహాయంతో కుట్లు వేసి ఇంటికి పంపారు. పట్టుమని 15 రోజులు కాకుండానే కుట్లు విడిపోవటంతో మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ నేపథ్యంలో బాధిత మరియ రాణి బంధువులు బుధవారం ఏలూరు జీజీహెచ్ వద్ద కొద్దిసేపు ఆందోళన చేశారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో మరియరాణికి అనారోగ్యం బారినపడిందని వాపోయారు. ఇటీవల ఎనిమిది సిజేరియన్ అపరేషన్లు చేయగా ప్రతి మహిళా ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నారని, బాధిత బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. కుట్లు సరిగ్గా వేయకపోవటంతో ఇన్ఫెక్షన్ రావటంతో రోగాల బారిన పడుతున్నారని చెబుతున్నారు.



ఏలూరు జీజీహెచ్‌లో బాధితురాలు దాసరి మరియరాణి

జగన్ హయాంలోనే ప్రజారంజక పాలన



దెందులూరు : యువత పోరు కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ప్రజా రంజక పాలన అందించారని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, వడ్డీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్ మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని కోరుకునే పార్టీ వైఎస్సార్ సీపీ అని వివరించారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ విజయం తథ్యమన్నారు. పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసు రాజు, జిల్లా కార్యదర్శి కట్ట ఏసుబాబు, సంతోష్, సర్పంచులు ప్రభుదేవా, రఘు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరంతా మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు ఏలూరులో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలని కామరెడ్డి నాని, తేరా ఆనంద్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన నడుస్తోందని ఆరోపించారు.

పార్టీ బలోపేతానికి కృషి

వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరికీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఒక ప్రకటనలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శ్రేణులు, అభిమానులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

భీమడోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



జీఎం అరుణకుమార్ జైన్‌కు సమస్యలను వివరిస్తున్న పెద్దలు

భీమడోలు: స్థానిక రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల, ఫుట్‌పాత్ వంతెనను విస్తరణ, తదితర సమస్యలపై ఏలూరు రైల్వే స్టేషన్‌కు విచ్చేసిన ఆ శాఖ జనరల్ మేనేజర్ అరుణకుమార్ జైన్‌కు బుధవారం భీమడోలు సీనియర్ సిటిజన్లు, గ్రామ పెద్దలు వినతిపత్రం అందించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వచ్చే భక్తులంతా ఈ స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తున్నారని, కొంత కాలంగా వివిధ కారణాలతో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఎత్తేశారని పేర్కొన్నారు. దీంతో భక్తులు ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో దిగి భీమడోలు మీదుగా ద్వారకాతిరుమలకు వెళ్తున్నారని వివరించారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని, భీమడోలు రైల్వేస్టేషన్‌లోని ఫుట్‌పాట్ వంతెన మూడు ట్రాక్‌లకు సరిపడేంత నిర్మించాలని కోరారు. రైల్వే జీఎంను కలిసిన వారిలో గ్రామ పెద్దలు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, పి.వెంకట్, ఆర్‌డీఎం ప్రసాద్, భోగరాజు రామారావు, మరడాని సత్యనారాయణలు ఉన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

రైతు సేవా కేంద్రాల్లో అపరాల కొనుగోలు

పెదపాడు: స్థానిక రైతు సేవా కేంద్రంలో అపరాల కొనుగోలు చేయనున్నట్టు మార్క్‌ఫెడ్ మేనేజర్ సీహెచ్ ఎల్ఎన్‌డీవీ ప్రసాద్ గుప్తా తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులో రైతు సేవా కేంద్రంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. అపరాల శాంపిల్‌ను రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్లి నాణ్యతను పరిశీలించి, గోనె సంచులు అందిస్తారని చెప్పారు. ముందుగా సీఎం యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

నిరంతర వ్యాయామంతో ఆరోగ్యం

గణపవరం: క్రమంతప్పని వ్యాయామం, ఆహార నియమాలతో గుండె వ్యాధుల ముప్పుకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ గుండె వైద్య నిపుణులు టీపీఎస్ ప్రసాద్, గౌరీ శంకర్ రెడ్డి అన్నారు. బుధవారం గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎంఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన గణపవరం లయన్స్ క్లబ్ భవనంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. స్ట్రోక్, ఎంజినా గురించి, గుండె వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి రోజూ కనీసం గంట సమయం వ్యాయామానికి కేటాయించాలని సూచించారు పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నిడమర్తి జయసూర్య, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడారు. కార్యక్రమంలో హిమశంకర్, నిమ్మల సుబ్బారావు, సంకు శ్రీను, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తులు

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బూర్ సింగ్ మీనా తెలిపారు. బుధవారం కేంద్రీయ విద్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో మార్చి ఏడో తేదీ నుంచి మార్చి 21 వరకు, రెండో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఖాళీలను బట్టి ఆఫ్‌లైన్‌లో ఏప్రిల్ రెండో తేదీ నుంచి 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు కేంద్రియ విద్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వాసుదేవుని కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట శ్రీదేవి, భూదేవి, సమేత వాసుదేవస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం విష్వక్సేన పూజ, అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారుని, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేశారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, రుత్విక్‌రుణ, అఖండ దీపారాధన నిర్వహించారు. మండపారాధన, అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, హోమాలు నిర్వహించి ధ్వజారోహణ చేసి బలిహరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గరుడ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కందుకూరి వేంకట విజయకుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా స్వామి వార్ల కల్యాణ మహోత్సవం



స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారం భూ, నీళా సమేత జనార్ధన స్వామి, రంగనాయక స్వామి వార్ల కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యార్చన, సేవాకాలం, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి, అమ్మవార్లకు ఎదుర్కోలు ఉత్సవం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): త్వరలో చేపట్టే ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ కారణాల వల్ల హేతుబద్ధీకరణ జరిగి తరచూ ఉపాధ్యాయులను స్థాన చలనం చేయాల్సివస్తోందని తెలిపారు. అటువంటి వారికి నష్టం జరుగకుండా సంబంధిత పాయింట్లు కలిపి హేతుబద్ధీకరణ వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడేళ్లలో పదవీ విరమణ చేయబోయే వారికి, అంధ ఉపాధ్యాయులకు తప్పనిసరి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారులు ఇటీవల విడుదల చేసిన సీనియారిటీ జాబితాలోని తప్పులను సరిచేసి నిబంధనల ప్రకారం సక్రమమైన జాబితాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



లఘుచిత్రాన్ని ప్రదర్శిస్తున్న ఎస్సై వీరప్రసాద్

నిడమర్రు: సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థీ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై వీర ప్రసాద్ అన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్‌లపై అవగాహన రథం నిడమర్రు జెడ్పీ స్కూల్‌కు బుధవారం వచ్చింది. రథంపై ఉన్న డిజిటల్ స్క్రీన్‌లతో సైబర్ నేరాలపై అవగాహన కల్పించే పలు లఘు చిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై వీర ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాల పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో స్మార్ట్ ఫోన్ వాడేవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్‌లలో తెలియని మెయిల్, వెబ్‌సైట్ల లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	36	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	10, 15
బెండకాయలు	40	కంద	76
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	32
కాకర కాయలు	36	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	80
కాలీఫ్లవర్	--	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32	పాలకూర	12
దొండకాయలు	40	తోటకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	26	గోంగూర	07-08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24-36	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	40
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	32